ణాల వల్ల ఆ ప్రాభవం తగ్గుతూ వచ్చింది. 1980తో హాకీ పతకాలు ఆగిపోయాయి. 1984 - 1996 పన్నెండేళ్ల పాటు మన దేశం ఎలాంటి పతకమూ లేకుండానే ఒలింపిక్స్‌కి వెళ్లి వచ్చింది. క్రమంగా పరిస్థితి మారింది. దేశంలో ఆటల పట్ల ఆసక్తి పెరగడం, ప్రపంచీకరణ వల్ల వస్తున్న నిధులు, క్రీడా సంస్థల ప్రోత్సాహం వల్ల... వ్యక్తిగత పోటీల్లోనూ పతకాల వేట మొదలైంది. ఒక్కో ఏడాది మెరుగుపడుతూ 2020 ఒలింపిక్స్‌లో ఏకంగా ఏడు పతకాలను గెలుచుకుంది మన దేశం. మన దేశం ఇప్పటిదాకా గెలుచుకున్న పతకాలలో ఇవి ఐదో వంతు కావడం గమనార్హం! 1980 తర్వాత మళ్లీ హాకీలో పతకాన్ని గెలుచుకుంది కూడా 2020 ఒలింపిక్స్‌లోనే! ఈసారి కూడా మన క్రీడాకారులు మంచి ఫలితాలనే సాధిస్తారని దేశం యావత్తు ఎదురుచూస్తున్నది!

**భారత్ అతిథిగా మారేనా!**

2024 ఒలింపిక్స్ ఘనంగా జరిపేందుకు ఫ్రాన్స్ సిద్ధంగా ఉంది. 1924 తర్వాత మళ్లీ వందేళ్లకు ఆ దేశానికి ఒలింపిక్స్‌ను నిర్వహించే అవకాశం రావడం విశేషం. ఇందుకు సుమారు 80 వేల కోట్ల రూపాయల ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. 32 క్రీడల్లో 329 ఈవెంట్లు జరగనున్నాయి. వీటిలో పతకాలను గెలుచుకునేందుకు పదివేల మందికి పైగా క్రీడాకారులు పోటీ పడుతున్నారు. ఈ ఒలింపిక్స్ కోసం మన దేశం నుంచి 111 మంది ఉన్న జట్టు పారిస్ చేరుకోనుంది. నీరజ్ చోప్రా, పారుల్ చౌదరి, పీవీ సింధు, లక్ష్యసేన్, నిఖత్ జరీన్, ఆకుల శ్రీజ, వినేష్ ఫోగట్ వంటి హేమాహేమీలు గత ఒలింపిక్స్‌ను మించిన పతకాలు తెస్తారని ఆశిస్తున్నారు.

గెలుపు ఓటములకు అతీతంగా ప్రతీ ఒలింపిక్స్‌నూ అభిమానించే మనం వాటిని నిర్వహించేది ఎప్పుడు? అన్న అనుమానం రావడం సహజం. 2028 ఒలింపిక్స్ కాలిఫోర్నియాలో, 2032లో జరిగేవి ఆస్ట్రేలియాలో నిర్వహించనున్నట్టు ఇప్పటికే స్పష్టమైంది. మన దేశం 2036 ఒలింపిక్స్‌ను నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నది. ఒకప్పుడంటే ఒలింపిక్ కమిటీ సభ్యుల ఓటింగ్ ద్వారా ఆతిథ్య దేశాలను నిర్ణయించేవారు. కానీ ఇప్పుడలా కాదు. వేర్వేరు అంచెలలో, ఒలింపిక్ కమిటీల ముందు తమ లక్ష్యాలను, సన్నద్ధతను, వనరులను నిరూపించుకుంటేనే ఆతిథ్యానికి అవకాశం దక్కుతుంది. ఇదేమంత తేలికైన ప్రక్రియ కాకున్నా... 2036 పోటీలకు ఆతిథ్యం ఇవ్వడానికి మన దేశం చాలా గట్టిగానే ప్రయత్నం చేస్తున్నది.

ఒలింపిక్స్ కోసం అసాధారణంగా ఖర్చు పెట్టడం అంటే ఆకలి చావులను పరిహసించడమే అని కొందరు వాదించవచ్చు. వనరులు ఉన్న దేశాలే నెగ్గే ఈ పోటీలు క్రీడాస్ఫూర్తికి విరుద్ధమంటూ మరికొందరు ఎగతాళి చేయవచ్చు. కానీ లోకమంతా ఎదురుచూసే ఈ ఆటల పోటీని తక్కువగా అంచనా వేయలేం. ఒలింపిక్స్ జరిగే కొద్ది రోజులైనా ప్రతి ఇంట్లోనూ, క్రీడల పట్ల చర్చ జరుగుతుంది. ఆయా తరాలలో ఆసక్తి పెరుగుతుంది. మన దేశంలోనూ కొన్నాళ్లపాటు టెన్నిస్, హాకీ వంటి ఆటలకు మరింత ప్రచారం ఏర్పడటానికి ఒలింపిక్స్ పతకాలు కూడా కారణమయ్యాయి. ఈసారి కూడా అలాంటి మార్పు కనిపిస్తుందనీ, అది శాశ్వతంగా నిలిచిపోతుందనీ ఆశిద్దాం.

## వివాదాలూ లేకపోలేదు

**నీరో చక్రవర్తి పేరు చరిత్రకు కొత్తేమీ కాదు. రోమ్ సామ్రాజ్యం తగలబడిపోతుంటే, ఫిడేలు వాయిస్తూ ఉండిపోయాడని మనం చదువుకున్నాం. ఆ నీరో క్రీ.శ 67లో జరిగిన ఒలింపిక్స్‌లో పాల్గొన్నాడు. సాక్షాత్తూ చక్రవర్తి బరిలోకి దిగితే, తనను విజేతగా పేర్కొనాల్సిందే కదా! అలా ఓ ఏడు పోటీలలో విజేతగా నిలిచాడు నీరో. అసలు తన కోసమే కొన్ని పోటీలను నిర్వహించడం విశేషం. ఒలింపిక్స్ ఎరుగని వాయిద్య పోటీ, నాటక పోటీలు నిర్వహించేలా చేసి... విజేతగా ఆలివ్ కిరీటాల్ని ముసిముసిగా ధరించాడు నీరో. ఓ పందెంలో రథం నుంచి కింద పడిపోయినా, తననే విజేతగా ప్రకటించక తప్పలేదు. ఇంత దారుణంగా కాకపోయినా... ఒలింపిక్స్‌లో చాలా వివాదాలే నడిచాయి.**

1936 ఒలింపిక్స్ ద్వారా తమ జాతి అత్యున్నతమైందని లోకానికి చాటాలనుకున్నాడు హిట్లర్. ఆయన లక్ష్యానికి అనుగుణంగా, ఒక యుద్ధానికి సిద్ధమైన రీతిలోనే జర్మన్ క్రీడాకారులు ఆ పోటీలకు సన్నద్ధమయ్యారు. ఆ ఏడాది జరిగిన ఒలింపిక్స్‌లో ఎక్కువ పతకాలు జర్మనీకే వచ్చాయి. కానీ హిట్లర్ ఊహించని ఓ అనూహ్య సంఘటన తన అహాన్ని దెబ్బతీసింది. అమెరికన్-ఆఫ్రికన్ అయిన జెస్సీ ఒవెన్స్, పరుగులో ఏకంగా నాలుగు పతకాలు గెలుచుకోవడమే కాకుండా... గంట వ్యవధిలో మూడు రికార్డులు బద్దలుకొట్టాడు. దాంతో నిరాశ చెందిన హిట్లర్, అతనితో చేతులు కలపకుండానే స్టేడియం నుంచి నిష్క్రమించినట్లు చెబుతారు.

1968లో మెక్సికోలో ఒలింపిక్స్ జరగనున్న సందర్భంగా, అక్కడి విద్యార్థులు రాజకీయ కారణాలతో నిరసన ప్రదర్శన తలపెట్టారు. దాన్ని ఎలాగైనా అణచివేయాలని సంకల్పించిన ప్రభుత్వం, ప్రదర్శనకారుల మీద తూటాల వర్షాన్ని కురిపించింది. 300-400 మంది విద్యార్థులు ఆ బులెట్లకు బలయ్యారని అంచనా!

తమ ఖైదీలను విడిపించుకునేందుకు పాలస్తీనా తీవ్రవాదులు 1972 మ్యూనిచ్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న 11 మంది ఇజ్రాయెల్ క్రీడాకారులను బంధించే ప్రయత్నం చేశారు. ఈ ఘటనలో తీవ్రవాదులతో సహా, ఆ పదకొండు మందీ చనిపోయారు.

ఒలింపిక్స్‌ను నిర్వహించే దేశం పట్ల వ్యతిరేకతతో ఏదో ఒక సభ్య దేశం క్రీడలను బహిష్కరించడం ఆ పోటీల చరిత్రలో కొత్తేమీ కాదు. కానీ 1980 రష్యా ఒలింపిక్స్‌ని ఏకంగా 65 దేశాలు బాయ్‌కాట్ చేయడం విశేషం. నాటి రష్యన్ కమ్యూనిస్ట్ ప్రభుత్వం పట్ల విభేదాలతో ఆయా దేశాలు బాయ్‌కాట్ చేశాయి. అప్పట్లో ప్రపంచాన్ని రెండుగా విడదీసిన ప్రచ్ఛన్న యుద్ధపు (కోల్డ్ వార్) పరిస్థితులకు ఇది పరాకాష్ఠ.

PARIS

**ఇవే కాదు! 2008 బీజింగ్ ఒలింపిక్స్ పట్ల నిరసన ప్రదర్శనలు, వేర్వేరు ఒలింపిక్స్ పోటీల్లో అమెరికాలో నల్లజాతీయుల పట్ల విద్వేషానికి వ్యతిరేకంగా అసమ్మతి, వ్యక్తిగత దాడులు, డోపింగ్ వైఫల్యాలు.... ఇలా ప్రతి ఒలింపిక్స్‌లోనూ ఏదో ఒక వివాదం వినిపిస్తూనే ఉంటుంది. ఈసారైనా అవి ప్రశాంతంగా జరుగుతాయని ఆశిద్దాం.**

